'చాలా బాగుంది' మరో సారి అనుకున్నాడు గంగరాజు. తన ముందు నుంచి వెళుతున్న వ్యక్తిని తేరిపార చూస్తూ సాగేడు. అతను గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్లిపోయేడు.

గంగరాజు తన చొక్కా వైపు పరీక్షగా చూసుకున్నాడు. అది బాగా మాసిపోయి ఉంది. 'ఇవాళ్టితో దీనికి విముక్తి'— నిశ్చయించు కున్నాడు. అప్రయత్నంగా అతని చేతులు నిక్కరు జేబుల్ని తడిమినాయి.

తృప్తిగా ఊపిరి పీల్చి కదిలేడు.

పొద్దు వాటారుతూంది. మేలిమి బంగారం కరిగి ఎత్తైన కొండల మీద నుంచీ జాలువారుతున్నట్టుంది, పడమటి దిక్కు.

బ్రిడ్జి దిగి మలుపు తిరిగేడు గంగరాజు. పరిసరాల్ని పరికించేడు. మార్కెట్ ప్రదేశమంతా మూర్ఛపోయి ఉంది. 'రోజూ ఈ సమయంలో తిరణాళలా ఉండేది. ఇవాళేం వొచ్చిందో.' పైకే అన్నాడు. కాలవ గట్టున కుండల దుకాణాల్లో మాత్రం కొంచెం సంచలనం కనిపిస్తూంది. మార్కెట్‌కి ఆ దుకాణాలు ఓ ఫర్లాంగు దూరంలో ఉన్నాయి. వాటికి ముందుగా ఉంది చేపల బజారు.

'ఇక్కడేం లాభం లేదు' అనుకుంటూ నడక సాగించేడు. అడ్డ రోడ్డులో నుంచి అవతలి బజారుకు చేరేడు. ఆరిపోబోతున్న బీడీని చివరిసారిగా పీల్చి, దాన్ని అవతలికి విసిరేసేడు. ఒక్కసారి ఒళ్లు విరుచుకుని చుట్టూ చూసేడు. ఎదురుగా, సినిమాహాలు సందు మొదట్లో ఒక యువకుడు నిలబడి ఉన్నాడు. గంగరాజు దృష్టి [illegible] తొడుక్కున్న టెరిలిన్ షర్ట్ మీద [illegible]ంది 'శ్వేత నీలం రం[illegible] — చాలా [illegible] గంగ[illegible] [illegible]తూంది. మనుష్యుల్లో [illegible] వెళ్లి పోయాడు, తన పక్కగా వచ్చిన మరో వ్యక్తితో కలిసి.

తనను పట్టుకుంటూ వెళుతున్న వ్యక్తిని ఆశ్చర్యంగా చూసేడు గంగరాజు. బాగా వయసు మీరిన వాడే. అయితేనేం — చక్కగా టెరిలిన్ షర్టే తొడిగేడు. 'ఈ రంగు ఇంకా బాగుంది ఎర్ర గడి. ఇవాళెట్టాగైనా సరే సాధించి తీరాలి.' గంగరాజు దృఢంగా నిర్ణయించుకున్నాడు.

రెండడుగులు వేసి రోడ్డు దాటేడు. సినిమా హాలు సందు మొదట్లోకి వచ్చి నిలబడ్డాడు. వీధి దీపాలు వెలిగినాయి. గంగరాజు చూపులు దేనికోసమో వెదక సాగినాయి.

దీప స్తంభం క్రిందుగా మిఠాయి బండిని ఆపుకుని, జనం రాకకి వేచి చూస్తున్న శేఠ్‌జీ, చిప్స్ పళ్లెం సరిచేస్తున్నాడు. అతని పక్కగా ముంత మసాలా అమ్ముకొనే వ్యక్తి — "మసాలా — గరం గరం మసాలా" అని ఉండి ఉండి కేక వేస్తున్నాడు.

సరిగ్గా, వీళ్లిద్దరికీ ఎదురుగా చంద్రం గొంతుక్కూర్చుని ఉన్నాడు. చంద్రం గంగరాజుకు తెలుసు. నిక్కరు జేబులోనుంచి తన ఆయుధాన్ని తీసేడు చంద్రం. అది నల్లటి బొగ్గు కణిక! సిమెంటు రోడ్డుమీది దుమ్మును కొంత మేర చేత్తో దులిపి, తన కార్యక్రమాన్ని మొదలెట్టాడతను. క్షణాల్లో ప్రత్యక్షమైనాడు, ఎడమ చేతిలో కోదండాన్ని ధరించి, కుడి చేత్తో భక్తులకు అభయహస్తాన్నిస్తున్న శ్రీరాముడు!

సినిమా హాలు గంట వినిపించింది. మాటినీ వదలబోతున్నారు. ఉత్సాహంగా మరో బొమ్మను మొదలెట్టాడు చంద్రం.

గంగరాజుకు విసుగు కలిగింది. చంద్రాన్ని చూస్తూంటే చిరాకు కలుగుతూంది అతనికి. 'మూగవెధవ — క్షణంలో జనం మూకను దగ్గిరికి లాక్కుంటాడు.'

జన సంచారం ఎక్కువైంది. దారిన పోయే జనం శ్రీరాముడి చుట్టూ నిలబడుతున్నారు. గంగరాజు దృష్టి వచ్చే పోయే మనుషుల మీదికి ఎగుడు దిగుడుగా కదులుతూంది.

"ఇక్కడ నిలబడితే — ఇట్టా గుటకలు మింగుతూ కూర్చోవటమే మిగిలేది. ఒరేయ్, గంగూ, అట్టా పోదాం, రా."

గంగరాజు ఈ లోకంలోకి వచ్చేడు. తన పక్కగా వెంకడు. అతనికి వెనగ్గా ఖాన్, బలరావ్.

"ఏమిటోరా — ఇయ్యాల గిరాకీలు తగలటం లేదు." నీరసంగా అన్నాడు గంగరాజు.

"ఛ. అదేం మాటరా! పాసెంజర్లొల్లేకాడ కాపెయ్యాల్రా. పద" అన్నాడు బలరావ్.

నలుగురూ కదిలేరు. రద్దీ లోంచి తప్పుకుంటూ ముందుకు పోయేరు. అక్కణ్ణుంచి రోడ్డు సన్నబడి పోయింది. రోడ్డు లాగానే వీధి దీపాలూ డీలా పడుతున్నాయి. చీకటి పడింది. వంతెన దాకా వచ్చేరు.

**ఆకలి, అజ్ఞానం ఏ పనైనా చేయిస్తాయి. కష్టపడి సంపాదించలేనివాడు కష్టపడకుండా సంపాదించాలని చూడ్డం. అందుకు పక్క దారులు వెతకడం కద్దు. పక్కదారులు తొక్కే వారి దారులు ఒకటైనప్పుడు రెండు రైళ్ళూ ఢీకొనక తప్పదు. ఈ సంఘర్షణలో బాధ్యతలు, కుటుంబాలు దెబ్బతింటాయి.**

వంతెన మీద కూర్చున్నారు నలుగురూ. వంతెనకి మొదట్లో వీధి దీపం ఉంది. వంతెనకి వెనగ్గా బియ్యపు మిల్లు ఉంది. పనివాళ్ల సమ్మెతో అదిప్పుడు మూత పడింది.


నలుగురి కళ్ళూ తీక్షణంగా పరికిస్తున్నాయి. గంగరాజు మనసుమాత్రం టెరిలిన్ షర్ట్‌నే మననం చేసుకొంటూంది.

ఉన్నట్టుండి ఉత్సాహంగా కిందికి గెంతేడు ఖాన్. "గంగూ! రెడీ!" అని, "పదండిరా, పోదాం" అంటూ వెంకడికీ, బలరావ్‌కీ సైగ చేసేడు. గంగరాజు వంతెన దిగి నిక్కరు జేబులోకి కుడిచేతిని పోనిస్తూ దీపం కిందికి వచ్చేడు. మిగిలిన ముగ్గురూ దూరంగా తప్పుకున్నారు.

, ఏదో ఆలోచించుకుంటూ, పరధ్యానంగా వస్తున్నాడో నడివయస్సు వ్యక్తి. గంగరాజు జేబులోనుంచి తన ఆయుధం తీసి, దీపం వెలుగులో కూర్చున్నాడు.

"రండి, రండి — పావలాకు అర్ధా, అర్ధకు రూపాయ్, రూపాయ్‌కు రెండు" అంటూ అరవసాగేడు. ఆ వ్యక్తి దృష్టి గంగరాజు మీదికి మళ్లింది. గంగరాజు కళ్లు మెరిసేయి

"రండి, రండి — రూపాయ్‌కి రెండు, రెండుకు నాలుగు" అంటూ చేతిలో ఉన్న నవారుని మడతలు పెట్ట సాగేడు.



ఆ వ్యక్తి గంగరాజుకు సమీపంగా వచ్చేడు. అతనికి పక్కగా వచ్చి నిలబడ్డాడు బలరామ్. మరో వైపు చేరేడు ఖాన్.

"ఏమిటోయ్ అది? రూపాయ్‌కి రెండా? నిజంగా రెండు రూపాయలూ ఇచ్చేస్తావా?" అమాయకుడిలా అడిగేడు బలరామ్.

"అవును, చూడండి. ఇందులో నిజమైన మడత నవారుకు మధ్యగా ఒకటే కదూ ఉంది? దాన్ని ఈ పుల్లెట్టి కనుక్కోవాలి. కనుక్కుంటే, మీరు రూపాయ్‌కి రెండు సంపాదించచ్చు."

"కనుక్కోలేకపోతే?" ఖాన్.

"రూపాయ్ నా కొస్తుంది."

"బాగుందే! ఏదీ, ఆ నవారు మడతేసి చూపించు." బలరామ్ అడిగేడు.

గంగరాజు నవారుని అయిదారు మడతలు వేసి క్రింద పెట్టేశాడు. తన చేతిలోని పుడకతో దాని మధ్యగా ఉన్న ఖాళీలో నొక్కి ఉంచేడు. మరో చేత్తో నవారు కొన పట్టుకుని లాగేడు. పుడక సరిగ్గా నవారు మధ్య మడత దగ్గిర నిలబడి ఉంది.

"అరె. బలే తేలిక! ఇదో పెద్ద బెమ్మవిద్దెట్టా?" ఖాన్ అన్నాడు. అతను క్రిందికి వంగి కూర్చున్నాడు.

"అయితే చూసుకో ... కాసుకో..." గంగరాజు మళ్లీ నవారుని మడతలు వేయసాగేడు.

"కాసుకుంటా గానీ — ఓ మాటు ఉత్తినే ట్రయలెయ్యనిస్తావా?" అడిగేడు ఖాన్. "అట్టాగే ... కానీ." గంగరాజు పుడకని అతని చేతి కిచ్చేడు.

ఖాన్ ఆలోచించి ఆలోచించి, పుడకని నవారు మధ్యగా నేలకేసి నిలబెట్టేడు. "నువ్వే తియ్" అన్నాడు గంగరాజు. ఖాన్ నవారుని లాగేడు. మధ్య మడతలోనే చిక్కుకుంది పుడక. "హాయ్ ... గెలిచా ..." అరిచేడు ఖాన్.

"కూర్చోండి, గురూగారూ ... చూద్దాం." బలరామ్ ఆ వ్యక్తి భుజం మీద చెయ్యి వేసి కూర్చోబెట్టాడు— మరికొంతమంది జనం చుట్టూ చేరేరు. ఆ వ్యక్తి బలరామ్ వైపు అదోలా చూస్తూ కూర్చున్నాడు.

"అయితే, నిజంగా డబ్బు లిస్తావేటోయ్?" బలరామ్ ప్రశ్న.

"గెలిస్తే — ఇస్తా ..." గంగరాజు నిర్ధారణ చేసేడు.

"ఇదిగో రూపాయ్ ... పెట్టు .." ఖాన్ జేబులో నుంచీ రూపాయ నోటు తీసి గంగరాజు కిచ్చేడు. గంగరాజు తన హస్తలాఘవం చూపేడు. ఖాన్ జాగ్రత్తగా ఆ మడతల్ని గమనించి, పుడకని



ఓ చోట ఉంచేడు. ఆత్రంగా నవారుని లాగేడు. పుడక మధ్యగా ఉంది, నవారుకు.

"గెలుపు మీది. ఇదిగో రెండు రూపాయలు" అంటూ రెండు రూపాయల కాగితాల్ని ఖాన్ కిచ్చేడు గంగరాజు. ఆనందాన్ని అభినయించేడు ఖాన్.

కొన్ని క్షణాలు తన పాట తాను పాడి, "మళ్ళీ కాయండి ... మీరు ... మీరు" అంటూ అందర్నీ ఆహ్వానించేడు గంగరాజు. ఈసారి బలరావ్ ఓ అర్ధ రూపాయి పందెం వేశాడు. అతనూ నెగ్గేడు. గంగరాజు రూపాయి ఇచ్చేడతనికి.

"ఏమిటండీ — ఇది" అంటూ జవాన్ని తప్పుకుంటూ ముందుకొచ్చి నిలబడ్డాడు వెంకడు. గంగరాజు పద్ధతి, పథకం, పందెం నియమాలూ వల్లించేడు.

"అయితే, నా పందెం రెండు రూపాయలు" అంటూ కూర్చున్నాడు వెంకడు. అతనూ గెలిచేడు. అతనికి నాలుగు రూపాయలూ ఇచ్చేడు గంగరాజు.

"మీరూ రేమిటో గానీ, ఓయూ గారూ, మీరూ ఓ మాపు చూడండి." బలరావ్ ఆ వ్యక్తిని పలకరించేడు.

"రాజారావ్ లెండి" అని, "ఎందుకండీ? నా కివన్నీ తెలివు" అన్నా డతను.

"తెలిసే దేముంది, రాజారావ్ గారూ! మా శారుగా ... నాకు రూపాయ్ వచ్చింది" అన్నాడు ఖాన్.

"మీ కంత అనుమానంగా ఉంటే నే నాడి పెడతాను. మీ కేం భయం లేదు. ఏదీ ఓ రూపాయి ఇటివ్వండి." భరోసా ఇమ్మి చెయ్యి జాపేడు బలరావ్.

బిక్క చూపులు చూసేడు రాజారావ్. తన జేబును చేత్తో తడిమి చూసుకున్నాడు. గంగరాజు కేసి చూసేడు, అదోలా. నవారు కేసి అబ్బురంగా చూసేడు. పుడకని అపురూప వస్తువుని చూస్తున్నట్టు పరికించేడు. చివరికి గట్టిగా ఊపిరి పీల్చి వదిలేడు.

బనియను జేబులని నోట్ల కట్టని బయటికి తీసి మధ్యగా ఉన్న రూపాయ కాగితాన్ని లాగి బలరావ్ కిచ్చేడు. "జాగ్రత్తండోయ్" అంటూ మిగిలిన సొమ్ము పై జేబులో పెట్టుకున్నాడు. గంగరాజు కళ్లు మెరిసేయి. ఖాన్ కళ్లు చికిలించేడు!

రాజారావ్ బరిలోకి దిగేడు! రాజారావ్ బరిలోకి లాగబడ్డాడు!

బలరావ్ గెలిచేడు, మొదటి పందేన్ని. రాజారావ్‌కి కొండంత ధైర్యం వచ్చింది.

"ఈ సారి మీరే చూడండి" అంటూ పక్కకి జరిగి కూర్చున్నాడు బలరావ్.

మళ్ళీ రూపాయే పందెం కాసేడు రాజారావ్. రూపాయ వచ్చింది. అతనికి తన తెలివితేటల మీద నమ్మకం కుదిరింది. ఈ సారి రెండు రూపాయల కాగితం బరిలో నిలిచింది. గంగరాజు నెగ్గేడు. దాన్ని జేబులో ఉంచుకుంటూ, "అబ్బ ... రూపాయిచ్చేసరికి తల ప్రాణం తోక కొచ్చింది" అని నిట్టూర్చేడు.

జనం నెమ్మదిగా జారుకోసాగేరు. రాజారావ్ మరో రెండు రూపాయలు



రాలలో రతనాలు ఫోటో — కె. కుసుమ మోహనరావు

పోగొట్టుకున్నాడు. ఇప్పు డతనికి పౌరుషం హెచ్చింది. పట్టుదల ఎక్కువైంది. జేబులోని నోట్ల బొత్తిని బయటికి తీసి అదోలా అందరివైపూ చూసేడు.

"ఏమిటండీ — అంత సందేహిస్తారు? పందెం పెంచండి. పోయిన దానితో సహా తిరిగొస్తుంది." వెంకడు ఉచిత సలహా ఇచ్చేడు.

క్షణంసేపు తటపటాయించి, అంతలోనే ఒక నిర్ణయానికి వచ్చి, అయిదు రూపాయల నోటు తీసేడు రాజారావ్. గంగరాజు తన చాకచక్యాన్ని ఉపయోగించి నవారుని మడిచి "కానీయం" డన్నాడు ధీమాగా. రాజారావ్ చేతివేళ్ళు చిత్రవిచిత్రంగా నృత్యం చేయసాగినాయి. వాటితోపాటు వేళ్లు పట్టుకున్న పుడకా అటూ ఇటూ తచ్చాడ సాగింది. చివరికి అది ఒక చోట ఆగింది.

కప్ప పోయి పోయి పాము నోట్లోనే పడుతుంది. పుడక దిగులుగా, భయం భయంగా, సందేహం సందేహంగా వణికి వణికి, తప్పుడు మడతనే కోరుకుంది.

వేళ్ళు గంగరాజునే ఆశ్రయించినాయి! మచ్చిక చేసుకోవటంలో అతను నేర్పరి మరి!

రాజారావ్ గుండెలు జారినాయి. కాని, చతుష్టయం, వాటిని పట్టి, పీకి, సరి అయిన ప్రదేశంలో పెట్టి ధైర్యాన్ని నూరి పోసింది. "మళ్లీ ఆడి గెలవవచ్చు" అని హాస్యాన్ని మేళవించి, రాజారావ్‌లో ఆశని మేల్కొల్పింది.

ఫలితంగా రాజారావ్ జేబులో విశ్రాంతి తీసుకుంటున్న గాంధీ గారు గంగరాజు చేతుల్లో పడ్డారు. ఆ తరవాత రెచ్చిన రోషంతో, హెచ్చిన ఉక్రోషంతో పడవల్ని వదిలేడు రాజారావ్. మూడు పడవలూ మునిగిపోయినాయి!

ఖాన్, బలరావ్, వెంకడూ జారుకున్నారు — రాజారావ్ స్పృహలోకొచ్చేసరికి. ఖాళీ జేబులు రాజారావ్‌ని వెక్కిరించినాయి. అక్కడ మిగిలిన ఒకరిద్దరు పాసెంజర్లూ తన మొహంకేసి చూసి జాలిగా నవ్వుతున్నట్టనిపించిం దతనికి. హఠాత్తుగా కళ్లల్లో నీళ్లు తిరిగినాయి.

"అంతా మోసం, దగా, పచ్చి అన్యాయం" అని పెద్దగా అరిచేడు. సాధనాల్ని జేబులోకి జేరుస్తూ హేళనగా నవ్వేడు గంగరాజు.

రాజారావ్‌కి ఏడుపు ముంచుకొచ్చింది. "నా డబ్బంతా దగా చేసి లాక్కున్నాడు. ఆస్పత్రిలో ఉన్న మా తమ్ముడి కివ్వాలని తీసుకొచ్చాను. తిరుగు ఛార్జీకి కూడా మిగల్లేదు. పచ్చిమోసం. ఏమిటి చెయ్యటం?" ఎవరితోనో చెపుతున్నట్టు అన్నాడు రాజారావ్.

"మోసం, దగా అంటా వేమిటయ్యా? ఆటలో ఓడిపోయావ్, పోగొట్టుకున్నావ్" అని పక్కకు తిరిగి అక్కడ నిలబడ్డ వాళ్లతో — "ఏమండీ మీరంతా చూస్తూనే ఉన్నారుగా, అతను గెలిచినప్పుడల్లా డబ్బిచ్చానా లేదా? అంతకు ముందు వాళ్లు నన్ను కానీ గెలవనీకపోతే నేనూ ఇలాగే ఏడ్చానా? చెప్పండి, సార్" అన్నాడు.

వాళ్లంతా బుర్రలు తాటించారు అవు నన్నట్టు. ఒకాయన అననే అన్నాడు: "నిజమే గదండీ. జూదం ఆడేరూ, ఓడిపోయారూ. దాని కిప్పుడు ఏడ్చి లాభమేమిటి?"

రాజారావ్ వాళ్లందరివైపూ 'అంతేనా' అన్నట్టు జాలిగా చూసేడు. పైపంచె తీసి నోరు నొక్కుకున్నాడు. గంగరాజు కేసి ప్రాధేయపూర్వకంగా చూసేడు.

"అందుకే, ఇలాంటి వాటి జోలికి పోవద్దన్నారు — మన పెద్దలు." మరో పెద్దయ్య గొడుగు తిప్పుకుంటూ సాగిపోయేడు.

గులకరాళ్ళు డబ్బాలో పోసి కదిలించినట్టు నవ్వుకుంటూ ముందుకు కదిలేడు గంగరాజు. సాగిపోతున్న వాళ్లందర్నీ సజలాలైన కళ్లతో చూస్తూ ఉండిపోయాడు రాజారావ్.

రోడ్డు మలుపు తిరిగి దీపం వెలుగులో నిలబడ్డాడు గంగరాజు. పై జేబులో నుంచీ నోట్లు తీసి, వాటిని సరిచేసి ఎంచుకున్నాడు. అతనికి ఎక్కడలేని తృప్తి కలిగింది. నలభై నాలుగు రూపాయల ఆదాయం!

అంతలోనే బిలబిలమంటూ వచ్చేరు వెంకడు, బలరావ్, ఖాన్. గంగరాజు వాళ్ళ ముగ్గురికీ తలా ఐదు రూపాయిలూ ఇచ్చేడు. మిగిలిన డబ్బంతా మళ్ళీ లెక్క పెట్టుకుని జేబులో దాచేడు. 'లాభం లేదు — ఇది చాలదు' అనుకున్నాడు.

"చాయ్ తాగుదాం రండి." ఖాన్ టీ కొట్టు వైపు దారి తీసేడు. అంతా కదిలేరు. "హాస్పిటల్లో తమ్ముడి కివ్వటాని కొచ్చింది — ఇచ్చాగాదు." బలరావ్ పగలబడి నవ్వేడు. ముగ్గురూ శ్రుతి కలిపేరు.

"ఈ దెవడో మరీ మేక మెదడు బాసతుగా ఉంది రొరేయ్ ..." వెంకడు జోకేడు. మళ్ళీ నవ్వుకున్నారు అందరూను. "లేకపోతే, పడవలు పడవలు ఎవడు ముంచుకుంటాడంటా ?" బలరాం.

మిత్రుల మాటలు వింటున్నాడన్న మాటే గానీ, గంగరాజు మనసంతా పింఛరంగు మీదా, ఎర్రగడి మీదా తారట్లాడుతూంది.

టీ దుకాణంలోకి వచ్చి కూర్చున్నారు. నాలుగు టీలకి ఆర్డరిచ్చేడు ఖాన్. "ఏం, భాయ్, ఇయాల గిరాకీ బాగుందా యేం, ఫుల్ చాయ్ లాగిస్తున్నావ్?" టీ కొట్టు మురుగన్ అడిగేడు. "అవును, భాయ్!" జవాబిచ్చేడు ఖాన్.

గంగరాజు దృష్టి మురుగన్ తొడుక్కున్న చాకొలెట్ కలర్ టెరిలిన్ షర్ట్ మీద కేంద్రీకృతమై ఉంది. 'ఇంక్ కేస్ చూసి ఇయ్యాళే కొనిచ్చెయ్యాలి.' మనసులో తీర్మానించుకున్నాడు.

ఉన్నట్టుండి వెంకడు అన్నాడు: "రేయ్, గంగూ, ఇదిగోరా రెండు రూపాయిలూ — ఇందాక నే గెలిచినవి." కాగితం గంగరాజుకి అందించి, "నే నియ్యాలింటికి పోవాలి. నన్నొదిలెట్టు" అని అడిగేడు. గంగరాజు డబ్బు తీసుకొన్నాడు.


టీలు వచ్చినాయి. ఖాన్ రూపాయి కాగితం తీసి ఇచ్చాడు గంగరాజుకు. బలరావ్ అర్థ రూపాయి నాణెం ఇచ్చేడు.

'ముప్పై రెండున్నర' అనుకుంటూ టీ తాగసాగేడు గంగరాజు.

టీ దుకాణం బయటి కొస్తూనే అన్నాడు ఖాన్: "నేనూ పోతున్నారా, గంగూ, పనుంది."

"సరే అయితే, ఇయ్యాల్టికి ఆపేద్దాం." బలరావ్ తీర్మానించేడు. వాళ్ళు ముగ్గురూ వెళ్ళిపోయేరు.

మెయిన్ రోడ్డు వైపు నడవసాగేడు గంగరాజు. ఉన్నట్టుండి అతని దృష్టికి దాను కనిపించాడు. రోడ్డు పక్కగా



శిల్ప ప్రాభవం                    ఫోటో — కె. సత్యనారాయణరావు

మురుగు కాలవ ఒడ్డున కూర్చుని ఆట సాగిస్తున్నాడు దాను. అతని వేళ్ళ ఆధారంగా మూడు పేక ముక్కలు — ఎంతో సున్నితంగా వింత నాట్యాన్ని చేస్తున్నాయి. 'ఈ దానుగాడికి వేళా పాళా లేదు' అనుకుంటూ సాగిపోయాడు గంగరాజు.

మెయిన్ రోడ్డెక్కి రెండడుగులు వేసి పేవ్‌మెంట్ మీద నిలబడ్డాడు గంగరాజు. ఎదురుగా పూల కొట్ల దగ్గర జడలు సిగలు అలంకరించుకుంటున్నాయి. వాటి పక్కనే ఉన్న ఫాన్సీ కంగన్ హాల్స్ నిండా మెరుపు తీగెలు. ఆ నాలుగు షాపుల అవతల క్లాత్ షాప్! గంగరాజు జేబు మీద చెయ్యి వేసుకున్నాడు. అడుగు ముందుకు వేయబోయి ఆగేడు. 'రాదేమో ఈ డబ్బుకి' అనుకున్నాడు. నిరుత్సాహంగా పెదవి విరిచేడు. చూపులు మరల్చి తనకి వెనగ్గా చూసేడు. సీతు గిన్నెలోని సేమ్యా పాయసాన్ని గరిటెతో కలుపుతూ "గ్లాసు పది, గ్లాసు పది" అని అరుస్తున్నాడు గడ్డాల ముసలాయన. ఆయన పక్కగా ఓ పదేళ్ళ కుర్రాడున్నాడు. వాడు పెద్ద పళ్ళెం నిండా వేరుశెనగలు పెట్టుకుని, 'అయిదు—పది, అయిదు—పది' అంటూ ముసలాయనతో పోటీ పడుతున్నాడు, అరవటంలో. పిల్లిద్దరికీ కొంచెం అవతలగా ఓ ముసల్ది పెంకు ముక్కతో కుంపటి చేసుకుని మొక్కజొన్న పొత్తులు కాలుస్తూంది. వాళ్ళ ముందుగా వస్తున్నా డొకతను. అతని ఒంటినిండా — పట్టుదారాలూ, బెడ్ షీటు వస్త్రాలూ, పిన్నీసులూ, రిబ్బన్లూ వేలాడుతున్నాయి. చేతిలో పండ్లపొడి పొట్లాలున్నాయి. పేటప్పేటి దండకమూ వల్లిస్తూ చాలా గంభీరంగా నడిచి వస్తున్నాడు.

వీళ్ళందర్నీ చూస్తుంటే గంగరాజు కో అనుమానం వచ్చింది — 'ఈ జేరాల మీద ఎంత లాభం వొస్తుంది, దానితో పిక్కెట్టా బతుకుతున్నారూ' అని. వెంటనే వచ్చొచ్చింది. 'తెలివి తక్కువ దద్దమ్మలు ... బతకటం తెలీని మనుసులు' అనుకున్నాడు.

ఆలోచనని ఆపి నడక సాగించేడు. రెండడుగులు వేయగానే ఠకీమని కొట్టుకున్నాడు, ఎదురుగా వస్తున్న వ్యక్తిని. "ఏం కన్ను నెత్తిమీద పెట్టుకు నడుస్తున్నావ్" అంటూ ఆత్మీయంగా చూసేడు గంగరాజు. వాడు సింహాద్రి. వాడు భుజానికి ఉన్న జోలెని కుడిచేత్తో సవరిస్తుంటూ, "ఒరేయ్, గంగా. బావ్నా?" అని పలకరించేడు. అతను చాలా హుషారుగా ఉన్నట్టు కనిపించేడు.

"జేరా లెలా ఉన్నాయ్‌రా ..." అడిగేడు గంగరాజు, సింహాద్రి భుజానికి ఉన్న జోలె కేసి చూస్తూ. "వచ్చేడు ..." అంటూ సాగిపోయేడు సింహాద్రి.

"చిల్లరవెధవ. ఆ గోలీం జాడమంతా పైసలతో సరి." ఎవరితోనో చెపుతున్నట్టు అన్నాడు. క్షణంసేపు సింహాద్రికేసి అదోలా చూసి కదిలేడు గంగరాజు.

గంగరాజు పార్క్ దాకా నడిచేడు. అక్కడ రోడ్డు చాలా విశాలంగా ఉంది. పార్క్‌కి ఆనుకుని పారుతున్న మురుగు కాలవ గట్టున చాలా బడ్డీ కొట్లున్నాయి. వాటిలో అనేక రకాల వ్యాపారాలు సాగుతూ ఉంటాయి.

"గంగూ ..." పిలుపు వినిపించింది.

గంగరాజు అవైపు చూసేడు. చంద్రంగాడు కేకేశాడు. గంగరాజు చంద్రం బడ్డీ కొట్టు దగ్గిర కొచ్చేడు. కొట్లో ఇద్దరు మనుషులు కూర్చుని అట్టలూ, పుస్తకాలూ పరీక్షిస్తున్నారు. వాటి నిండా అంకెలు! గంగరాజుకు పక్కగా బెంచీమీద ఓ కుర్రాడున్నాడు. వాడు తన చేతిలో ఉన్న పుస్తకాన్ని చాలా ఆత్రంగా, ఆసక్తిగా చదివేస్తున్నాడు. ఆ పుస్తకం అట్ట మీద — సినిమా తారల బోలిన స్త్రీ యౌవనం, ఆమె లోనెక్ జాకెట్లో నుంచి జారిపోతూంది.

"ఇయ్యాల నీ నెంబరెంతరా, గంగూ? ఓ రూపాయికి రాస్తా — చెప్పు." చంద్రం చేతిలో చిన్న పుస్తకం, పెన్సిలు ఉన్నాయి.

"ఇయ్యాళేం వద్దశా." విసుగ్గా అన్నాడు గంగరాజు. నివ్వెరపోయి అతని ముఖంలోకి చూసేడు చంద్రం. ఇంతలో ఓ యువకుడు గంగరాజుని రాచుకుంటూ కొట్టు దగ్గిరికొచ్చేడు. గంగరాజు అతని కేసి తేరిపార చూసేడు. ఖరీదైన దుస్తుల్లో, కళ్ళజోడుతో, గిరజాల జుట్టుతో, కాళ్ళకున్న బూట్లతో మెరిసి పోతున్నా డతను. గంగరాజు అతని షర్ట్‌ని పరీక్షగా చూసేడు. 'చాలా చాలా బాగుందది.'

"ఏవన్నా వచ్చినయ్యా?" చంద్రాన్ని అడిగే డతను.

"వచ్చినాయి, సార్" అంటూ ఎంతో వినయంగా, గౌరవంగా చిన్న కవ రొకటి

తీసి అతనికి అందించేడు పంద్రం. అతను దాన్ని చూసి కొండంత సంబర పడిపోయేడు. కవర్లో నుంచి ఒక్కొక్క ఫోటోనే తీసి చూడటం మొదలెట్టాడు. అవన్నీ నగ్న చిత్రాలు!

గంగరాజు అతని చొక్కా అంచుల్ని వేళ్లతో పట్టుకుని చూసేడు. గొంతు సరిచేసుకుని, "ఎంతయుంది, సార్, ఇది?" అంటూ ప్రశ్నించాడు. అతను కంగారు పడ్డాడు. గబుక్కున ఫోటోల్ని దాచేస్తూ, "ఏది, ఏది?" అని ఎదురుప్రశ్న వేశాడు.

గంగరాజు సన్నగా నవ్వుతూ, "మీ షర్ట్ అండీ" అన్నాడు. అతను తేలిగ్గా ఊపిరి పీల్చుకుని, "నలభై ఆరు రూపాయలు" అని సమాధాన మిచ్చేడు. 'అబ్బో' అనుకున్నాడు గంగరాజు. అతను మరి కొంచెంసేపు ఆ ఫోటోల్ని చూసి, కవరు చంద్రానికి ఇచ్చేసి, "పది పైసలు రాసుకో పద్దులో" అంటూ వెళ్లి పోయాడు.

గంగరాజు అతని షర్ట్ వైపు చూస్తూ ఏదో ఆలోచనలో పడిపోయేడు.

"గంగూ ... గంగూ!" ఆత్రంగా పిలిచిన పిలుపుకి తెప్పరిల్లుకున్నాడు గంగరాజు. పిలుపు వినిపించిన దెసగా చూసేడు.

రోడ్డుకు అవతలి వైపుగా రిక్షాలు ఆగి ఉన్న చోట నిలబడి ఉన్నాడు గోపాలం. "రారోరేయ్, గంగూ, ఓ సారిటు రారోయ్!" చేతులు ఊపుతూ పొలికేకలు పెడుతున్నాడు.

గంగరాజు గబగబా నడిచి గోపాలం దగ్గర వచ్చేడు.

గోపాలం ఒక్కసారిగా బావురుమన్నాడు.

గంగరాజు ఆశ్చర్యపోతూ, "ఏంవైందిరా, ఏవిటి" అని అడిగేడు. వాడు కళ్లు నులుముకుంటూ మొదలెట్టేడు: "మా ఇంట్లో అందరికీ నిన్నటేల నుంచీ కూడు లేదు. మా అయ్యేటో సచ్చిండు. మా అమ్మ ఇయ్యాల పొద్దుట్నుంచీ కూలి చేసింది. ఇంటికాడి కొచ్చి నాకో రూపా యిచ్చింది — నూకలు తెమ్మని."

"దీని కేడు పెందుకురా?" దిక్కులు చూస్తూ తేలిగ్గా అన్నాడు గంగరాజు.

"అది గాదురా, ఆ రూపాయ్ కాత్తా..." నసిగేడు గోపాలం, ఏడుపుని కొంచెం కొంచెం దిగమింగుకుంటూ.

"ఆఁ ఏవైంది?"

"అడుగో, ఆడు కొట్టేసిండు. చేత్తో పక్క రిక్షాలో కూర్చుని బీడీ వెలిగించుకుంటున్న రిక్షావాణ్ణి చూపేడు గోపాలం.

గంగరాజు ఒక్క ఉదుటున అక్కడికి వెళ్లేడు. "ఏరా, ఈడి రూపాయ్ కొట్టేశావంట?" గోపాలం వాడికేసి క్రోధంగా చూస్తూ నిలబడ్డాడు.

గంగరాజు మరోసారి గద్దించేడు: "ఏరా, మాట్లాడవేం?"

"పో ... యెశా ... పెద్ద పోటుగాడిలా వచ్చేవ్. ఆ డోడిపోయిండు. నా కొచ్చింది." తాపీగా బీడీ పొగని వదులుతూ చెప్పేడు.

"అంతా మోసం, దగా ..." గోపాలం పళ్లు నూరేడు.

"మోసవేందిరా, గుంటడా? పావలాకి అర్ధ రూపాయ్ నూక్కుపోదామనుకున్నావ్. ఓడిపోయావ్. మొత్తం రూపాయీ నే గెలుచుకున్నాను."

"అదేం కాదురా, గంగూ! పావలా కాసు చేత్తో పట్టుకుని దాని మీదున్న సంవత్సరం రైటుగా చెపితే పావలాకి అర్ధ రూపా యిస్తానన్నాడు. సరేనని చెపితే ..." ఆగి, "నూకల డబ్బు కాత్తా పోయింది, మా అమ్మ చంపేత్తాది. మా తమ్ముళ్లు, చెల్లమ్మ ఎదురు చూత్తా ఉంటారు. సచ్చినాడు, అన్యాయంగా రూపాయ్ నూకిండు..." అని ఏడుస్తూ తిట్లు మొదలెట్టాడు గోపాలం.

గంగరాజుకు కోపం ముంచుకొచ్చింది.

"ఏందిరా, ఆడు సెప్పేది నిజవేనా?" రిక్షావాడి చొక్కా పట్టుకొని గద్దించేడు. వాడు నోట్లో బీడీని తీసి అవతల పారేసి, "చొక్కా వదులు ముందు ... ఏం నిజవైతే ఏం చేత్తావేం?" అన్నాడు.

"ఏం చేత్తానా, దొంగ ముం ... క. కక్కు, ఆడి రూపాయ్ ఆడికి కక్కు" అంటూ ఒక్క దెబ్బ కొట్టేడు గంగరాజు, పిడికిలి బిగించి.



వికసనం                    ఫోటో — ఆర్. బి. షిండే (కొల్హాపూర్

"కొడతావ్‌రా ... నన్నే కొడతావ్‌రా... నీ అంతు తేలుస్తా నుండు." తుండు తీసి తలకు చుట్టి, చొక్కా చేతులు పైకి సాచి చెంపకేసి కొట్టేడు గంగరాజుని.

గంగరాజుకి కళ్లు బైర్లు కమ్మినాయి. క్షణంలో తెప్పరిల్లుకుని పళ్లు నూరేడు. పిడికిలి బిగించి, పెదవులు బిగపట్టి వాడి మీదికి దూకేడు. "తిత్తి తీస్తా నొరేయ్ ... తిత్తి తీస్తాను. అన్యాయంగా ఆడి కాడ రూపాయ్ కొట్టేసింది గాక, నా మీద కొత్తావ్ రా ..."

ఇద్దరూ కలబడ్డారు.

గోపాలం వెక్కులు పెడుతూ రిక్షా వాణ్ణి శాపనార్థాలు పెడుతున్నాడు.

చుట్టూ జనం మూగేరు.

ఎవరో ఇద్దర్నీ విడదీయటానికి ప్రయత్నించేరు. కానీ, ఇద్దరూ లొంగ లేదు. ఇంకొక అత నెవరో కల్పించుకుని, ఇద్దర్నీ చెరో వైపు తోసి పారేశాడు.

గంగరాజు ఇసుక దిబ్బలో పడ్డాడు. రిక్షా అతన్ని మరొక రెవరో అవతలికి లాక్కుపోయేరు. జనమూ తప్పుకున్నారు.

"రేయ్, నీ రక్తం కళ్ల జూత్తాను సూడు ..." అంటూ లేచేడు గంగరాజు: గోపాలం అతని దగ్గరగా వచ్చేడు, కళ్లు తుడుచుకుంటూ.

గీరుకుపోయిన మోకాళ్లను తుడుచుకుంటూ కిందికి వంగేడు గంగరాజు. అతని జేబులోనుంచీ నోట్లూ, చిల్లరా క్రింద పడివాయి.

"అరె ... రె ... డబ్బు ..." అంటూ వాటి దగ్గరగా కూలబడి ఏరసాగేడు గోపాలం. గంగరాజు పరధ్యానంగా, మెత్తటి ఇసుకని మోకాలు మీద, గీరుకుపోయిన చోట అద్దుకుంటున్నాడు.

"గంగూ ... పొద్దున్న డబ్బులడిగితే లేవంటివి గదరా, ఇప్పుడు ఇన్ని డబ్బు లెక్కడివిరా ... ఏరా, గంగూ?"

గంగరాజు కళవళపడిపోయేడు. తల ఎత్తి గోపాలం వైపు చూసేడు. గోపాలం చూపులు గంగరాజు కళ్లలో గుచ్చుకున్నాయి. "ఇంత డబ్బెట్టా సంపాయించావ్‌రా, గంగూ?" మళ్లీ అడిగేడు గోపాలం.

"ఊఁ ... ఆఁ ..." తో తడబడ్డాడు గంగరాజు. "ఎట్టా సంపాయిస్తే ఏం గానీ... "అంటూ తల వంచుకుని పక్కకి కదిలేడు. అతని చేతులు అప్రయత్నంగా నిక్కరు జేబుమీదికి పోయివాయి. అతని కళ్లలో గోపాలం తల్లి రూపం లీలగా కదిలింది; ఆమె సంసారమూ ప్రత్యక్షమైంది. ★